పంట నష్టాలపై అంచనాలు

కావలి, ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలో అకాల వర్షాలకు దెబ్బతిన్న వివిధ రకాల పంటలను వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. పంట నష్టం అంచనాలను రూపొందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో కలెక్టర్ చక్రధర్‌బాబు ఆదేశాలు మేరకు ఆయా శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో రెండు రోజులుగా పర్యటిస్తున్నారు.



కలిగిరి: కుమ్మర కొండూరులో దెబ్బతిన్న నిమ్మ తోటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి షహిల్

కలిగిరి: మండలంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టం వివరాలను సేకరిస్తున్నామని వ్యవసాయాధికారి సురేష్, ఉద్యానశాఖాధికారి షహిల్ సోమవారం తెలిపారు. షహిల్ మాట్లాడుతూ కలిగిరి, జలదంకి మండలాల పరిధిలో నిమ్మ 48 హెక్టార్లలో, మామిడి 10 హెక్టార్లలో, ఎండు మిరప 115 హెక్టార్లలో నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. వ్యవసాయాధికారి సురేష్ మాట్లాడుతూ రావులకొల్లులో పచ్చిశనగ 400 ఎకరాలు, కుమ్మరకొండూరులో 300 ఎకరాలల్లో పత్తి నష్టం వాటిల్లిందన్నారు. మిగిలిన గ్రామాల్లో పంట నష్టం వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

నష్ట పరిహారానికి చర్యలు

అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ మెట్టుకూరు శిరీషా తెలిపారు. సోమవారం ఆమె పంట నష్టం వివరాలు సేకరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షాలకు కుమ్మరకొండూరు, పెద్దకొండూరు, లక్ష్మీపురం, అనంతపురం ప్రాంతాల్లో ఎక్కువగా నష్టం వాటిల్లిందన్నారు. వరి, మిరప, పచ్చిశనగ, నిమ్మ తోటలు దెబ్బతిన్నాయన్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోయాయన్నారు. కుమ్మరకొండూరులో ఈదురుగాలులకు పలు ఇళ్లు దెబ్బతిన్నాయన్నారు.

ప్రతి రైతుకు పరిహారం

జలదంకి: అకాల వర్షానికి నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నష్ట పరిహారాన్ని అందిస్తుందని కావలి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రాజకీయ సలహా కమిటీ సభ్యుడు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షం వల్ల జలదంకి, కలిగిరి, కొండాపురం, దుత్తలూరు, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో వందల ఎకరాల్లో వరి పంటకు నష్టం చేకూరిందన్నారు. దెబ్బతిన్న పంటలకు త్వరగా నష్ట పరిహారం అందించేలా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని, నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటారని తెలిపారు.

దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందిస్తాం

జలదంకి: మండలంలో కురిసిన వర్షాలు, గాలులు, వడగండ్లకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని కలిగిరి ఏడీఏ రామిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన జలదంకి మండలంలోని గట్టుపల్లి, అన్నవరం, రామవరప్పాడు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో వరి, పత్తి, మామిడి పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంట నష్టం వివరాలను సేకరించి నివేదికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఏఓ బి.శైలజ చినక్రాక, గోపన్నపాళెం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పంట నష్టం నివేదికలను జిల్లా అధికారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

అనుమసముద్రంపేట: అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను ఆత్మకూరు ఏడీఏ వి.దేవసేన సోమవారం పరిశీలించారు. మండలంలోని చిరమనలో రైతులతో కలిసి దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. అకాలంగా వడగళ్ల వాన రావడంతో వరి పైరు మొత్తం ధ్వంసమైనట్లు రైతులు ఆమెకు తెలిపారు. దెబ్బతిన్న పంటల వివరాలను సిద్ధం చేయాలని ఆమె వ్యవసాయశాఖ సిబ్బందికి సూచించారు. రైతులు తమ సాగు భూమికి సంబంధించి ఆధార్, బ్యాంకు ఖాతా నంబరు వంటివి వ్యవసాయ సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఆమె వెంట ఏఓ రజనీ, ఏఈఓ చిరంజీవి, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

దెబ్బతిన్న పంటలను కాపాడుకోండి

చేజర్ల: మండలంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను తక్షణమే కాపాడుకునేందుకు రైతులు చర్యలు చేపట్టాలని ఏఓ శశిధర్ సూచించారు. సోమవారం ఆయన రైతులకు పలు సూచనలు తెలియజేశారు. వరి పైరు ముంపునకు గురైతే నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలన్నారు. ఎకరానికి 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ పైపాటుగా వేయాలన్నారు. నేలవాలిన వరి పైరుపై లీటరు నీటికి 50 గ్రా. ఉప్పు నీటిని స్ప్రే చేస్తే మొలకలు రాకుండా నివారించుకోవచ్చన్నారు. ధాన్యం రంగు మారదన్నారు. పత్తి పైరు పెరుగుదల దశలో ఉంటే వర్షపు నీటిని తీసి వేసి 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను లీటరు నీటికి కలిపి మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. పంటకు అదనంగా ఎకరాకు 30 కిలోల యూరియా, 15 కిలోల ఎంఓపీ పైపాటుగా వేయాలన్నారు. పూత, పిందె దశలో ఉన్న పత్తిలో పలు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఆకుమచ్చ తెగుళ్ల ఉధృతి ఆపడానికి మాంకోజేబ్, కార్బండిజం మందును 2 గ్రాములు చొప్పన, ప్లాంటోమైసిన్ 0.2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వరుసల మధ్య గుంటక, గొర్రు ద్వారా సేద్యం చేయాలని రైతులకు సూచించారు.

రైతులను ఆదుకోవాలి

బిట్రగుంట: బోగోలు మండలంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను బీజేపీ రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షుడు పసుపులేటి సుధాకర్ సోమవారం పరిశీలించారు. సిద్ధనపాళెం, జువ్వలదిన్నె తదితర పంచాయతీల్లో వర్షాలకు నేలవాలిన వరి పంటను పరిశీలించి పంట నష్టంపై రైతులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



జలదంకి: గట్టుపల్లిలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న కలిగిరి ఏడీఏ రామిరెడ్డి



ఏఎస్‌పేట: దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు



చేజర్ల: ఏటూరు పంచాయతీ పడమటి కండ్రికలో పత్తిని పరిశీలిస్తున్న ఏఓ శశిధర్

క్లుప్తంగా

ఓటర్లను ఆధార్‌తో అనుసంధానించాలి

జలదంకి: బీఎల్వోలు ఓటర్లను ఆధార్‌తో అనుసంధాన ప్రక్రియను శరవేగంగా పూర్తి చేయాలని తహసీల్దార్ సీహెచ్ పద్మావతి సూచించారు. సోమవారం మండలంలోని బూత్ లెవల్ అధికారులతో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లెయిమ్స్ ఏమైనా ఉంటే పరిష్కరించాలని చెప్పారు. ఓటర్ల జాబితాలను స్థానిక సర్పంచ్‌లతో సమన్వయంతో అప్‌డేట్ చేయాలన్నారు. బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి, డిప్యూటీ తహసీల్దార్ భరత్, బీఎల్వోలు పాల్గొన్నారు.

చెరువుకు హద్దులు ఏర్పాటు



కలిగిరి పెద్ద చెరువుకు హద్దులు ఏర్పాటు చేస్తున్న అధికారులు

కలిగిరి: కలిగిరిలోని పెద్ద చెరువుకు సర్వేయర్ కౌసర్, ఇరిగేషన్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి సోమవారం హద్దులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 919/1లో 837 ఎకరాల విస్తీర్ణంలో పెద్ద చెరువు ఉందన్నారు. ప్రస్తుతం నేషనల్ హైవే పనులు జరుగుతున్న నేపథ్యంలో చెరువుకు దక్షిణం వైపు సర్వే చేసి రాళ్లు వేశారు. చెరువు స్థలం, కట్ట వెలుపల రహదారి నిర్మాణ పనులు చేసుకోవాలని ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించడం జరిగిందని తెలిపారు.

నేటి నుంచి విద్యార్థులకు రాగిజావ

వరికుంటపాడు: వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం నుంచి రాగి జావ పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓలు షావుద్దీన్, మస్తాన్‌వలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరికుంటపాడు మండలంలో 59 పాఠశాలల్లోని 2,792 మంది, ఉదయగిరి మండలంలోని 59 పాఠశాలల్లోని 3,386 మంది విద్యార్థులకు రాగిజావ అందిస్తామన్నారు. ఇప్పటికే రాగి పిండి, బెల్లం డీలర్ల వద్ద నుంచి హెచ్‌ఎంలు పాఠశాలకు చేర్చారన్నారు. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో జావ ఇస్తారన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



సుబ్బమ్మ (ఫైల్)

ఆత్మకూరు: మండలంలోని దేపూరుకు చెందిన దుద్దుగుంట సుబ్బమ్మ (76) ఐదు రోజుల క్రితం అదృశ్యమైనట్లు బంధువులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పది పరీక్ష కేంద్రాల పరిశీలన

ఉదయగిరి: వచ్చే నెల 3వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి మండలంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను సోమవారం ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సెయింట్ మేరీస్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు మౌలిక వసతులైన తాగునీరు, విద్యుత్ తదితర వసతులు పరిశీలించారు.

కరటంపాడులో స్వచ్ఛతా కార్యక్రమాలు



శానిటేషన్ పరికరాలు అందజేస్తున్న ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడులో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. కరటంపాడు చెత్త సంపద తయారీ కేంద్రానికి ప్రభుత్వం మంజూరు చేసిన రిక్షాలు, ఫాగింగ్ మెషిన్లు, హైప్రెషర్ టాయిలెట్ క్లీనింగ్ పరికరాలను సోమవారం కరటంపాడు పంచాయతీ కార్యదర్శి రేవూరు అంకయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కరటంపాడులో అన్ని సౌకర్యాలు, నాణ్యతా ప్రమాణాలతో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని తీర్చిదిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి ఉషారాణి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

అల్లూరు: స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలలో ఆదివారం రాత్రి పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జోన్-3 కే అక్కారావు ప్రతిభ కనపరిచిన విద్యార్థినులకు బహుమతులను ప్రదానం చేశారు. 10వ తరగతి పరీక్షల్లో తమ ప్రతిభను కనపరచి గురుకుల పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థినుల నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా కన్వీనర్ ప్రిన్సిపల్ డి కొండలరావు, మెడికవర్ డాక్టర్ గోకుల్ నచికేత్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వీవీ రమణ ప్రసాద్, ఉపాధ్యాయులు గంగిరెడ్డి, ఇస్కపల్లి పీహెచ్‌సీ డాక్టర్ పాండు రంగనాథ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

కొండాపురం: బీజేపీ ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని, లేని పక్షంలో తాడోపేడో తేల్చుకుంటామని ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ పందిటి అంబేడ్కర్ మాదిగ అన్నారు. ఈ నెల 15న మర్రిపాడులో ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధనకు ప్రారంభమైన పాదయాత్ర సోమవారం మండలంలోని ఎర్రబల్లికి చేరుకుంది. అక్కడి నుంచి గొట్టిగుండాల వరకు సాగింది. ఈ సందర్భంగా అంబేడ్కర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మాదిగలను నమ్మించి మోసం చేసిన విషయాన్ని ప్రతి పల్లెలో చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 3న బీజేపీ జిల్లా కార్యాలయ ముట్టడిని మాదిగలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ నాయకులు ఆందోనీ మాదిగ, కిషోర్ మాదిగ, హజరత్ మాదిగ, మాల్యాద్రి, మల్లికార్జున, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రబల్లిలో ఎంఎస్‌పీ నాయకుల పాదయాత్ర

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఉదయగిరి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సీడీపీఓ పచ్చవ లావణ్య సూచించారు. ఆమె సోమవారం పోషణ్‌పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా ఉదయగిరిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరయ్యే గర్భిణులు, తల్లులు, చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు జరుగుతుందన్నారు. మండలంలోని గండిపాళెం మెయిన్, ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చాంద్‌బేగం, మహాలక్ష్మమ్మ, ఆయాలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పిచ్చుకలను కాపాడుకుందాం

- ఘనంగా అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం



విద్యార్థులకు పిచ్చుకలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వి.శైలజ

కావలి: పట్టణంలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పీజీ సెంటర్‌లో సోమవారం ఘనంగా అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జంతుశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ వి.శైలజ మాట్లాడుతూ ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రతి సంవత్సరం మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి సంవత్సరం 'ఐ లవ్ స్పారోస్' అనే థీమ్‌తో వేడుకలు నిర్వహిస్తారన్నారు. ఎక్కువ మంది ప్రజలు పిచ్చుకలను రక్షించడానికి అనేక అవగాహన సదస్సులు, ప్రచారాలు జరుపుతారన్నారు. మనందరికి పిచ్చుకలతో ఏదో ఒక బంధం ఉందన్నారు. పక్షిని రక్షించడానికి మన ప్రయత్నాలు ఎక్కువగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోండి

కావలి రూరల్: ప్రస్తుతం ఆధార్ కార్డుల్లో చేర్పులు, మార్పులు తదితరాలను మొబైల్ ఆధార్ క్యాంప్ ద్వారా నిర్వహిస్తున్నామని, ఆ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటసుబ్బారావు తెలిపారు. మండలంలోని రుద్రకోటలో సోమవారం ఆధార్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆధార్ క్యాంపును తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 20, 21, 27,28, 29 తేదీల్లో మొబైల్ ఆధార్ క్యాంపును నిర్వహిస్తున్నామని, ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా ఐదేళ్ల లోపు పిల్లలకు కొత్త ఆధార్ కార్డులు ఇస్తున్నామన్నారు. 10 ఏళ్ల క్రితం తీసుకున్న ఆధార్ కార్డులు అప్‌డేట్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మస్తాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆధార్ క్యాంపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

క్రమం తప్పకుండా వ్యాయామం నిర్వహించాలి

ఉదయగిరి: ప్రత్యేకావసరాల చిన్నారులకు ఇంటి వద్దనే తల్లిదండ్రులు క్రమం తప్పకుండా అవసరమైన వ్యాయామం చేయించాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి తెలిపారు. ఆయన సోమవారం స్థానిక భవితా కేంద్రంలో అందిస్తున్న ఫిజియోథెరపి సేవలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ చిన్నారులకు భవిత కేంద్రంలో థెరపిస్ట్ నిర్వహించిన విధంగా ప్రతి రోజు ఇంటి వద్ద వ్యాయామం చేయించడం వల్ల వారి శరీర అవయవాల్లో మార్పు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ చాముండేశ్వరీ, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అలీం, సీఏ వశీం, సిబ్బంది పాల్గొన్నారు.



భవిత కేంద్రంలో సేవలు పరిశీలిస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి

ఆస్పత్రికి కుర్చీలు వితరణ

వింజమూరు: వన్ ఇండియా-వన్ విలేజ్ జనదేవోభవ, తిప్పిరెడ్డి చలమారెడ్డి-రాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వింజమూరు ఆస్పత్రికి సోమవారం మాజీ జెడ్పీటీసీ తిప్పిరెడ్డి నారపరెడ్డి కుర్చీలు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల వైద్యసేవలు ఆస్పత్రిలో అందడం పేదలకు ఎంతో మేలన్నారు. ఆస్పత్రి అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో నిమ్మకాయల కృష్ణారెడ్డి, సుబ్బారావు, వైద్యాధికారి గున్నం మధుసూదన్‌రెడ్డి, దాట్ల శ్రీనివాసులురెడ్డి, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

ఫిర్యాదులు రాకుండా సేవలందించాలి

ఆత్మకూరురూరల్: పౌర సరఫరాలశాఖ ద్వారా సబ్సిడీపై ప్రభుత్వం అందించే నిత్యావసరాలను ఫిర్యాదులు రాకుండా పంపిణీ చేయాలని ఆత్మకూరు డీటీ రాజేష్, సివిల్ సప్లయీస్ డీటీ శారదమ్మ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఎండీయూ ఆపరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు కేటాయించిన ప్రాంతాల్లో వీలైనంత వరకు ప్రతి ఇంటికి వెళ్లి నిత్యావసరాలు లబ్ధిదారులకు అందించేందుకు ఆపరేటర్లు కృషి చేయాలని కోరారు. ఒక్కో నెలలో తమకు సరుకులు రావడం లేదన్న ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, ఇకపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని రేషన్‌షాపు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు

చేజర్ల: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేయించాలని చేజర్ల మండల పశు వైద్యాధికారి పి.రాజేష్ తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని మడపల్లిలో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో గాలికుంటు వ్యాధి చాలా ప్రాణాంతకమైందన్నారు. మూడు నెలల వయస్సు పైబడిన ప్రతి పశువుకు విధిగా టీకాలు వేయించుకోవాలన్నారు. మండలంలోని పాడి రైతులందరూ తమ పశువులకు వైద్యాధికారుల సలహా మేరకు టీకాలు వేయించాలని ఆయన సూచించారు.

పారిశ్రామికంగా అభివృద్ధి చేయండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు చేస్తున్నట్లు తెలిపారు. కోట్లాది రూపాయలు వెచ్చించి సంగంలో మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్‌ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి అవార్డు పొందేలా చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఆత్మకూరు సమీపంలోనే నెల్లూరు-ముంబయి రహదారిపై నారంపేట వద్ద ఎంఎస్‌ఎంఈ పార్కు ప్రాంతాన్ని, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు 3 జాతీయ రహదారులు అనువుగా ఉన్నాయని వివరించారు. ఇప్పటికే వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెందుతున్న నియోజకవర్గానికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు ఏర్పాటు చేస్తే రైతులకు, యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా)లో చేర్చడం ద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు.

పంచాంగాన్ని ఆవిష్కరించిన సీఐ

వింజమూరు: డాక్టర్ జేవీఎస్‌పీ స్రవంతి సునీల్ రచించిన శోభకృత్ నామ సంవత్సర పంచాంగాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ సాంబశివరావు సోమవారం ఆవిష్కరించారు. మండలంలోని శంఖవరం సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్న స్రవంతి జ్యోతిష్య శాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆమె ఉగాదిని పురస్కరించుకొని శోభకృత్ నామ తెలుగు సంవత్సర పంచాంగాన్ని రచించారు. పంచాంగాలను సీఐ సాంబశివరావు, ఎస్సై జంపానికుమార్, పోలీసు సిబ్బందికి అందజేశారు.



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న సీఐ సాంబశివరావు

మిరపలో తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

కావలి రూరల్: ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు మిరప పంటను ఆశించే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవనశాఖ అధికారి సుధామయి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించి మిరప సాగును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మిరప రెండో కోత, ఎండుతున్న దశలో ఉందన్నారు. కల్లాల్లో ఉన్న కాయలు తడవకుండా టార్పాలిన్ పట్టలతో కప్పి జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అధిక తేమ వల్ల పంట మీద ఉన్న కాయలకు కాయకుళ్లు తెగులు రావడానికి ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల రైతులు ముందు జాగ్రత్తగా మాంకోజెబ్, క్లోరోథలోనిల్, థయోఫినైట్ మిథైల్ తగినంత మోతాదుల్లో పిచికారీ చేసుకోవాలన్నారు. తెగుళ్ల ఉధృతిని నివారించేందుకు డైఫెన్‌కోనజోల్, ప్రొఫికొనాజోల్ తగినంత మోతాదులో పిచికారీ చేసిన తర్వాత కాబ్రియోటాప్, అజాక్సిస్ట్రోబాన్‌లు పిచికారీ చేయాలి. సూక్ష్మపోషక మిశ్రమం, స్థూల పోషక మిశ్రమం తగినంత మోతాదుల్లో పంటపై పిచికారీ చేయాలన్నారు.



మిరపలో ఆశించే తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఖైదీలు మానసిక ఆరోగ్యం కలిగి ఉండాలి

కావలిరూరల్: ఖైదీలు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకుని నేరప్రవృత్తికి దూరంగా జీవించాలని డాక్టర్ టి.రమ్య తెలిపారు. పట్టణంలోని సబ్ జైల్ ఆవరణలో డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక ఒత్తిడితో క్షణికావేశాలతో నేరాలకు పాల్పడిన ఖైదీలు ఇక నుంచి మంచి ప్రవర్తనతో జీవించాలన్నారు. చిన్న తప్పు మీ కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తుందనే విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఈ సదస్సులో సబ్‌జైల్ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, డాక్టర్ నక్కా రేవంత్, స్వచ్ఛభారత్ కమిటీ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి, నెల్లూరు సబ్‌జైల్ అధికారి రవికుమార్, కావలి సబ్‌జైల్ సూపరింటెండెంట్ చిన్ని, వెంకటసుబ్బయ్య, ఖైదీలు తదితరులు పాల్గొన్నారు.



మానసిక ఒత్తిడిపై ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కంకర క్వారీ వద్దు

- అటవీ భూమిలో కంకర క్వారీకి దరఖాస్తు
- సంగంలో ప్రజాభిప్రాయసేకరణ

సంగం: సంగం అరుంధతీయవాడ సమీపంలోని అటవీశాఖ భూమిలో కంకర క్వారీ నిర్వహిస్తే పశుపక్షాదులతో పాటు గ్రామీణులకు సైతం ప్రమాదం వాటిల్లుతుందని, ఇక్కడ క్వారీ వద్దంటూ గ్రామీణులంతా ముక్తకంఠంతో తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. అరుంధతీయవాడ సమీపంలోని సర్వే నంబరు 231లోని 2.45 హెక్టార్ల భూమిలో కంకర క్వారీ నిర్వహించేందుకు శేషారెడ్డి అనే వ్యక్తి సంబంధిత శాఖకు గతంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక సచివాలయం-3లో క్వారీ నిర్వహణపై ఆర్డీఓ కరుణకుమారి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజనీరు రాజశేఖర్ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సంగం వైఎస్సార్‌సీపీ నేతలు కంటాబత్తిన రఘునాథ్ రెడ్డి, కర్నాటి రవీంద్రరెడ్డి, కాకు మధుసూదన్ యాదవ్‌తో పాటు ప్రజలు భారీగా పాల్గొన్నారు. పర్యావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ క్వారీ నిర్వహణకు అనుమతులు ఇవ్వొద్దని ముక్తకంఠంతో ఆందోళన చేశారు. దీంతో ప్రజాభిప్రాయసేకరణ రసాభసాగా మారడంతో సంగం ఎస్సై నాగార్జునరెడ్డి ఘటన స్థలానికి చేరుకుని మీ అభిప్రాయాన్ని శాంతియుతంగా తెలియచేయాలన్నారు. అధిక శాతం మంది కంకర క్వారీ వద్దని తేల్చి చెప్పడంతో అధికారులు సైతం ఉన్నతాధికారులకు ప్రజాభిప్రాయాన్ని తెలియజేస్తామని చెప్పి వెళ్లారు.



ప్రజాభిప్రాయ సేకరణలో కంకర క్వారీ వద్దంటున్న ప్రజలు